


# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు





సెప్టెంబర్, 2024




## పాఠకులకు వినాయక చతుర్థి శుభాకాంక్షలు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక
ఏలూరు

# విషయ సూచిక

సెప్టెంబర్ , 2024
సంపుటి-3
సంచిక-9



| | | |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 03 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 04 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకలి |
| 05 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 06 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 07 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 09 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 10 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః శ్రీ గురుభ్యోనమః శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.




యజ్ఞముల ద్వారా, అగ్నికార్యముల ద్వారా పరమాత్మతో మనలను అనుసంధానం చేస్తాడు పంచభూతదివ్యస్వరూపుడు అగ్నిభగవానుడు.ఆ అగ్నిభగవానుని ద్వారా వశిష్ఠునికి చెప్పబడి వేదవ్యాసునిచే లోకానికి అందించబడినది ఈ అగ్నిపురాణం. సంక్షిప్తంగా నవాహ (9 రోజుల) పారాయణమునకు వీలుగా అభినవశుక, ప్రవచననిధి పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు, వారి దివ్యాశీస్సులతో తమ శిష్యులచే సంకలం చేయించిన ఈ గ్రంథాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణ చేసినవారికి సమస్త వాస్తుదోషాలు, శత్రుపీడలు తొలగి, భయంకర కష్టాల్లోంచి బయటపడతారు. పుష్కరంలో స్నానం చేసి నూరు కపిలగోవులను దానం చేసిన మహాఫలితం పొందుతారు.

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org

శ్రీ ప్రణవపీఠం
सत्यं वद - धर्मं चर
ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం

## సమయమెఱిగి చేసిన పనులే శుభాలు



కాలం విష్ణుస్వరూపం. జ్ఞానమయం. కాలాన్ని గ్రహించి చేయవలసిన పనులు సకాలంలో చేయాలి. భాద్రపదమాసం గణేశుని జన్మకాలం. చతుర్థినాడు గణపతిని పూజించిన వారు విఘ్నాల నుండి బయటపడతారు. తల్లిదండ్రులను పూజించి, వారికి ప్రదక్షిణం చేయడం ద్వారా గణపతి ఆదిపూజ్యుడయ్యాడు. నేటి కాలం వారు ఈ విషయాన్ని గ్రహించి జీవితంలో పైకి రావాలి.

శ్లో॥ ప్రోష్ఠ పద్యాం, పౌర్ణమాస్యాం హేమసింహ సమన్వితమ్
యో దదాతి భాగవతం, స యాతి పరమాంగతిమ్ ॥
(భాగవతం.స్కం.12.అ.13.శ్లో.13)

భాద్రపదమాసంలో పౌర్ణమినాడు బంగారు సింహాసనంపై భాగవతాన్ని ఉంచి, ఊరేగించి, దానం చేసినవాడు, పరమపదవిని (వైకుంఠాన్ని) పొందుతాడు. ద్వారకలో మన మీ కార్యక్రమం చేసుకొంటున్నాం. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా అనగా యూట్యూబ్ ద్వారా గాని చూసి తరించగలరు. ఈ పని చేయలేనివారు భాగవతాన్ని శిరస్సుపై ఉంచుకొని, తలనే సువర్ణసింహాసనంగా భావించి, నారాయణ స్మరణం చేసినా శుభాలను పొందుతారు. భాద్రపదమాసంలో వ్యాకరణం, ఆంగ్లభాషనేర్చుకొనేవారు ఆయా విద్యలలో నిష్ణాతులవుతారు. విద్యలను నేర్చుకోవడం ఆరంభించిన వారు ఎట్టి పరిస్థితులలోనూ మధ్యలో ఆపకుండా పట్టుదలతో నేర్చుకోవాలని, అటువంటి వారే తనకు ప్రియులనీ గణపతి చెప్పిన మాటను నేటి విద్యార్థులు గుర్తుంచుకోవాలి. మెదలు పెట్టిన పనిని మధ్యలో విడచి పెట్టినవాడు ఇహపరాలు రెంటికీ చెడతాడు. మన ప్రణవపీఠం అన్ని రకాల విద్యలను, కళలను నేర్పించే 'విద్యానిధి' కార్యక్రమాన్ని యూట్యూబ్ ద్వారా నిర్వహిస్తున్నది. జ్ఞానాసక్తి కలవారు సద్వినియోగం చేసుకోండి. కాలం తిరిగిరాదు. పోయిన జన్మ కూడా మరలారాదు. ఈ జన్మను సార్థకం చేసుకొన్నవాడే సంపూర్ణజీవుడు. అటువంటి జీవుడే మాధవుడు. మానవుడు తలచుకొంటే మాధవుడు కాగలడని వ్యాసుడు చెప్పిన మాటలను మన సాధకులు నిజం చేసి గురుమార్గంలో ప్రయాణించాలని మంగళాశాసనాలు చేస్తున్నాను.

వద్దిపర్తి పద్మాకర్

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ప్రణవ దీప్తి



## విద్యానిధి

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి దివ్య ఆశీస్సులతో శ్రీ ప్రణవ పీఠం శిష్య బృందం నిర్వహిస్తున్న మహత్తర కార్యక్రమం విద్యానిధి. ఈ కార్యక్రమం ద్వారా వేల సంఖ్యలో ఆస్తికులకు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా స్తోత్రాలు, పూజా విధానాలు ,ఆసక్తి కలిగి అర్హులైన వారికి వేద సూక్తములు,భాగవత పద్యాలు ,సంగీతం ,హారతి పాటలు, భగవద్గీత వంటివి గురు భక్తులకు నేర్పుతున్నారు.తెలుగు, హిందీ ,సంస్కృత భాషలను,వేద గణితము,జియోగ్రఫీ ,గణితము వంటివి దేశ,విదేశాలలోని పిల్లలకు నేర్పుతున్నారు. ఉపాధికి అవసరమయ్యే అనేక విషయాలను కూడా ఈ కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తున్నారు

విద్యానిధి Updates కొఱకు క్రింద ఇవ్వబడిన whats app channel ను అనుసరించ గలరు
https://whatsapp.com/channel/0029VaH7mEJK5cD86BWCig40

శ్రీ ప్రణవపీఠం వారి విద్యా నిధి ఏలూరు | శ్రీ ప్రణవపీఠం సత్యం వద - ధర్మం చర ఏలూరు | శ్రీ ప్రణవపీఠం వారి గుడి-బడి ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ గణేశ పురాణం



విద్యామదంతో, ధనముందని అహంకరించి గ్రుడ్డి వాడి లాగా ప్రవర్తిస్తూ, గురువును పూజించని పాపాత్మునికి బ్రహ్మహత్యా పాపం లభిస్తుంది. ఇందులో సందేహం లేదు. గురువు దరిద్రుడైనా, పతితుడైనా, సామాన్యుడైనా, గౌరవించవలసినదే. గురువును అజ్ఞాని మాత్రమే పతితునిగా భావిస్తాడు. మానవమాత్రుడని భావించి, అల్పుడని ఎంచి గురువును గౌరవించని మూర్ఖుడు ఎన్ని పుణ్యతీర్థ స్నానాలు చేసినా పవిత్రుడు అవ్వలేడు. ఏ పుణ్యకర్మలు చేయడానికీ గురుద్రోహికి అధికారం లేదు. కనుక పరశురామా! "నీ గురువైన శంకరుని దర్శించి పూజించు. గురు కటాక్షం వల్లనే నీకు శుభాలు, పరాక్రమం కలిగాయి. దోష విముక్తికి, పుణ్య ప్రాప్తికి గురుదర్శనమే మూలం. ఆలస్యం చేయక గురువైన హరిని శరణు కోరుకో. శివుడు మంగళ మూర్తి. మంగళదాత. శుభప్రదాత. శాంతస్వరూపుడు. కృష్ణుడు ఆత్మ అయితే, శివుడు జ్ఞాన స్వరూపుడు. బ్రహ్మనైన నేను మనస్సును. ప్రకృతి సర్వశక్తి." ఇలా బ్రహ్మ చెప్పగా పరశురాముడు శివదర్శనానికి బయలుదేరాడు. శివలోకం బ్రహ్మలోకం కంటె లక్షయోజనాల ఊర్ధ్వ దూరంలో ఉంది. సకలశుభలక్షణాలతో కూడిన ఆ లోకాన్ని శివుడు తన మనస్సంకల్పంతో సృష్టించాడు. నిరాధారంగా కేవలం గాలిలో తేలియాడే లోకమది. కైలాసానికి కుడివైపు వైకుంఠం ఉంటుంది. ఎడమవైపు గౌరీలోకం ఉంటుంది. దానికి క్రింద ధ్రువమండలం ఉంటుంది. ఈ లోకాలన్నింటినీ దాటాక గోలోకం ఉంటుంది. ఇది ఏభై కోట్ల యోజనాల వైశాల్యం కలిగి ఉంటుంది. అవతారపురుషులు, పరమయోగులు, మహాతపస్వులు, భక్తులు తప్ప ఎవరుబడితే వారు ఈ లోకానికి వెళ్ళలేరు. హరి స్వరూపుడైన పరశురాముడు మనోవేగంతో శివలోకానికి వెళ్ళాడు. శుద్ధస్ఫటికమణులతో అలంకరింపబడి, సువర్ణభూములతో, మనోహరంగా ఉంది ఆ లోకం. ఆ లోకంలో అనేక మణిమంటపాలు ఉన్నాయి. అవన్నీ కాషాయవర్ణం, ఎఱ్ఱరంగులోనూ, మెరిసిపోతున్నాయి. ఆ మణిమంటపాలకు ముత్యాల హారాలు తోరణాలుగా వ్రేలాడదీయబడి ఉన్నాయి. ఆ లోకానికి ఒకవైపు యక్షులకు నివాసభవనాలున్నాయి. లెక్కలేనన్ని సుందరభవనాలు ఆ లోకంలో ఉన్నాయి. వాటి తలుపులు, స్తంభాలు అన్నీ మణిమయాలే. ఆ భవనాలపైన బంగారపు కలశాలున్నాయి. యక్షులు, యక్షనాయకులు అమూల్యరత్నాభరణాలు ధరించి శివుని భక్తితో సేవిస్తుంటారు. అక్కడి స్త్రీలు అపూర్వసౌందర్య స్వరూపిణులు. నానాలంకారాలు ధరించి తిరుగుతూ కన్నులకు పండుగ చేస్తుంటారు. పారిజాతవృక్షాలు, సువాసనతో నిండిన అనేక పుష్పఫలభరిత వృక్షాలు, పద్మాల కొలనులు, ఆకాశగంగ ఆ లోకానికి శోభను చేకూరుస్తుంటాయి. సిద్ధులు కొందరు అక్కడ నివసిస్తూ కల్పవృక్షాల నీడలో నివసిస్తూ, కామధేనువు ద్వారా కోరిన కోర్కెలు నెరవేర్చుకొంటుంటారు. సిద్ధులందరూ అష్టసిద్ధులు శివానుగ్రహంతో పొందినవారే. విశాలమైన మఱ్ఱివృక్షాలు, నానాశాఖోపశాఖలతో, ఊడలతో, పైన నివసిస్తున్న దివ్యపక్షులతో, ఆ పక్షుల మధురధ్వనులతో ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. అక్కడ ఉన్న సరస్సులు అన్నీ మధురమైన అమృతద్రవాలతో నిండి ఉంటాయి.

...ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## దానాలు – ఫలితాలు



బ్రహ్మపురాణంలో శ్రీవేంకటేశ్వర మాహాత్మ్యం అద్భుతంగా వ్యాసుడు వివరించాడు. వేంకటాద్రిలో తప్పక దానాలు చేయాలి. కొన్ని దానాలు ఆ కొండపై చేయలేము. అటువంటప్పుడు కొండపై సంకల్పం చెప్పుకొని, అనగా భూదానం, గోదానం, సువర్ణదానం చేస్తాము అనుకొని ఇంటికి వచ్చాక ఆ దానాలు చేసుకోవాలి. ఎందుకంటే కొండపై భూదానం చేసే అవకాశం ఉండదు గదా! ఈ విశేషాలను బ్రహ్మ పురాణం మనకు అందించింది. పూర్వం దిలీప చక్రవర్తి దుర్వాసుని దర్శించుకొన్నాడు. వేంకటాద్రి గురించి కొంతవఱకు తెలుసుకొన్నాను. ఆ కొండపై చేసే దానాలు శ్రీనివాసునకు ప్రీతిని కలిగిస్తాయని, విన్నాను. వాటిని గుఱించి వివరించు అని దుర్వాసునితో అన్నాడు.

శ్లోII కాని దానాని శస్తాని, కర్తవ్యాని మహీధరే
ప్రీతయే శ్రీనివాసస్య తాని మే వద సువ్రత!
(బ్రహ్మపురాణం.శ్రీవేం.మ. అ.10.శ్లో.1)

దుర్వాసమునీ! వేంకటాచలంపై ఎటువంటి దానాలు ప్రశస్తమైనవో, శ్రీనివాసునికి ఏ దానాలు ప్రీతిని కలిగిస్తాయో వివరించు. భగవంతుని అనుగ్రహం పొందడానికి ఆయన ఆదేశించిన దానాలు చేయడమే మానవకర్తవ్యం, అనగా దుర్వాసుడు దిలీపునితో ఇలా అన్నాడు - కొండపైన కొన్ని దానాలు ప్రత్యక్షం గానూ, మరికొన్ని పరోక్షంగానూ చేయాలి. జలదానం, అన్నదానం, వస్త్రదానం, సువర్ణరజతదానాదులు కొండపైననే ప్రత్యక్షంగా చేయవచ్చును. భూదానం వంటివి కొండపై సంకల్పించుకొని ఆ తరవాత వీలున్న ప్రాంతంలో చేయవచ్చును.జలదానం అత్యంత పుణ్యఫలప్రదం. జలం ప్రాణం. జలం విష్ణు నివాసస్థానం. వెంటనే ప్రాణాలు నిలబెట్టే ఉత్తమపదార్థం. అందునా కొండపైకి నడచి వెళ్ళేవారికి అన్ని చోట్లా నీరు దొరకక పోవచ్చును. అటువంటి చోట్ల జలదానం చేయడం కంటె పుణ్యమింకేముంది? స్కాందపురాణంలోని వైష్ణవఖండంలో ఈ జలదానం గూర్చిన విశేషాలున్నాయి.

శ్లోII వేంకటాఖ్యే మహాపుణ్యా తృషార్తానాం విశేషతః
జలదానమకుర్వాణః తిర్యగ్యోనిమవాప్నుయాత్ II
(స్కాం.పు.వైష్ణవఖండం.అ.16.శ్లో.1)

....ఇంకా ఉంది

# పురాణం లో మహిళలు

## భానుమతి

దుర్యోధనుడు తన మిత్రులందరు బయలుదేరుతారు. బలపరీక్ష లేని ఈ స్వయంవరం పాల్గొనటానికి కేవలం ఒక రాజ్యానికి యువరాజు అయ్యుండటమే అర్హత. భానుమతి సభలోకి పూలమాలతో అడుగుపెట్టగానే దుర్యోధనుడు వెంటనే ఆమెను ఎత్తుకొని హస్తినాపురానికి చేరి వివాహం చేసుకుంటాడు. తన ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా తనను బలవంతంగా తీసుకొచ్చి వివాహం చేసుకున్నందుకు తొలుత భర్త పట్ల భానుమతికి కొంత అసంతృప్తి ఉన్నప్పటికీ త్వరలోనే సర్దుకుపోయింది. దుర్యోధనుడికి భార్య భానుమతి అంటే చాలా ఇష్టం. ఇద్దరు చాలా అన్యోన్యంగా ఉండేవారు. పాండవుల పట్ల భర్త దుర్యోధనుడి దుష్ప్రవర్తనను ఎప్పటికప్పుడు తన మాటలతో అడ్డుకునే ప్రయత్నం చేస్తూ ఉండేది. దుర్యోధనుడు ఎంత ప్రేమ చూపించినప్పటికీ భార్య మాటను విన్నట్లే ఉండేవాడు, కానీ తర్వాత పెడచెవిని పెట్టేవాడు. ద్రౌపదిని నిండు సభలో అవమానించడం భర్త దానికి ప్రోత్సహించటం వంటి విషయాలు తెలిసినటువంటి భానుమతి మనసులో ఎంతో బాధపడుతుంది. ఎన్నోసార్లు ఏకాంతంలో భర్తతో హితబోధ చేస్తుంది. కౌరవపాండవ యుద్ధం వద్దని శ్రీకృష్ణుడు చెప్పిన విధంగా సంధి చేసుకోమని, అట్లా చేసుకుంటే అందరికీ మేలు జరుగుతుందని పరిపరివిధాలుగా చెపుతుంది. అయితే అది చెవిటివాడి ముందు శంఖం పూరించినట్లుగా మాత్రమే ఉంటుంది. ఎవరి మాట వినని దుర్యోధనుడు యుద్ధం చేసి గెలవడం క్షాత్ర లక్షణం అని నచ్చ చెబుతాడు. భానుమతి దుర్యోధనులకు ఇద్దరు సంతానం. కూతురు లక్ష్మణ. కొడుకు లక్ష్మణ కుమారుడు. భారతంలో వీరికి సంబంధించిన కథలు లేనప్పటికీ, తెలుగువారికే సొంతమైనటువంటి కొన్ని గాథలు ప్రచారంలో ఉన్నవి. అందులో శశిరేఖా పరిణయం వంటి కథలు మనకు కనబడుతూ ఉంటాయి. కురుక్షేత్రసంగ్రామంలో లక్ష్మణ కుమారుడిని అభిమన్యుడు వధిస్తాడు. దుర్యోధనుడు మరణించిన తర్వాత ఆ వార్త తెలిసిన వెంటనే భానుమతి ఆ విషయాన్ని విని తట్టుకోలేక వెంటనే చనిపోతుంది. భర్తను చక్కదిద్దుకొని మార్చాలనుకున్నప్పటికీ అతడు మారలేదు. కానీ భానుమతి వేదన పడలేదు ఆగ్రహించలేదు. భర్తతోనే తన జీవితం అనుకొని అతడినే సర్వస్వంగా భావించింది. ఆదర్శమైన వ్యక్తిత్వంతో భాసిల్లింది.

★★★★★


ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః     శ్రీ మాత్రేనమః     శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 335 . వేదవేద్యా [ఓం ఐం హ్రీం శ్రీం వేదవేద్యాయై నమః]



వేదాల ద్వారా తెలుసుకొనదగినది. ఉపనిషత్తుల సారాంశం గ్రహించి, వాటి ద్వారా అమ్మవారి రూపాన్ని ఊహించాలి. అమ్మవారి రూపం తెలియాలంటే వేదసారమే ముఖ్యమైనది. అమ్మవారు నివసించే చింతామణి గృహానికి నాలుగు ద్వారాలుంటాయి. అవి నాలుగూ నాలుగు వేదాలు. ఆ ద్వారాల నుండి మాత్రమే అమ్మ దగ్గఱకు వెళ్ళి అమ్మను చూడగలము. దేవీభాగవతంలో తూర్పు, ఋగ్వేద ద్వారం అనీ, దక్షిణం యజుర్వేద ద్వారం అనీ, అథర్వణం పశ్చిమ ద్వార మనీ, సామవేదం ఉత్తర ద్వారం అనీ ఉన్నది. తంత్వౌపనిషదం పురుషం పృచ్ఛామి అని వేదం చెపుతున్నది. ఉపనిషత్ సంబంధ పురుషుని భగవంతుని కొఱకు అడుగుతున్నాను అని దీని అర్థం. ఉపనిషత్ పురుషుడు అనగా సదాశివుడు. సదాశివుని ద్వారా అమ్మను గుఱించి తెలుసుకోవాలి అని కూడా ఈ మంత్రార్థం. భక్తిని మించిన విజ్ఞానం లేదు అని పురాణాలు అంటున్నాయి. భక్తి ద్వారా గ్రహించదగినది అమ్మవారు అని మరొక అర్థం.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

దేనినైనా త్వరగా అర్థం చేసుకోవడం కోసం, పనులను చేసేటప్పుడు సరియైన ఆలోచన చేసి, శీఘ్రంగా పనులు పూర్తి చేసుకొని, పనులలో విజయాన్ని పొందడం కోసం ఈ మంత్రాన్ని అనుష్ఠించాలి.పాలతో అమ్మవారి రూపం లేక శ్రీచక్రాన్ని అభిషేకించాక ఈ మంత్రాన్ని రోజునకు 327 మార్లు జపించాలి. జపం అయ్యాక తెల్లని పూలతో పూజించాలి. అభిషేకించిన పాలను తీర్థంగా త్రాగాలి. ఇలా మూడు నెలలు చేసిన వానికి బృహస్పతికున్నంత జ్ఞానం, కార్యసిద్ధి లభిస్తాయి.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

## ఋషి చరిత్ర

# వశిష్ఠ మహర్షి

అత్యంత సుకుమారులు, అల్లారుముద్దుగా పెంచుకొనే తన పిల్లలను అరణ్యాలకు పంపడానికి దశరథుడు తటపటాయిస్తాడు. అప్పుడు వశిష్ఠమహర్షి "మహారాజా! విశ్వామిత్రుడు శత్రువులను సంహరించగల సమర్థుడే. మీ పిల్లలకు అనుభవంతో ప్రావీణ్యం పెరిగి, భయం తొలగి హితం కలగుతుంది. నిరభ్యంతరంగా పంపండి" అని ప్రోత్సహిస్తాడు. దీనివల్ల దశరథుని మాట దక్కుతుంది. విశ్వామిత్రుని లక్ష్యం నెరవేరుతుంది. రామలక్ష్మణులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇది గొప్ప రాజనీతి లక్షణం. కొన్ని గాథలను బట్టి వశిష్ఠ విశ్వామిత్రులు పరస్పర శత్రువులని మనం అపోహ పడతాం. నిజానికి వారిద్దరూ మిత్రులే. ఒకరి మనసును మరొకరు ఎరిగిన వారు. ఒకరి శక్తిసామర్థ్యాలను, విద్యలను మరొకరు బాగా తెలిసున్న వారు. అందుకే విశ్వామిత్రుని కోరిక మేరకు "యోగవాశిష్ఠం" అనే వేదాంత గ్రంథం వ్రాసాడు. వాస్తు గురించి వివరించాడు. అదేవిధంగా ఒక సందర్భంలో నిండు కొలువులో విశ్వామిత్రుడు "రాముని సత్యధర్మ పరాక్రమాలు నాకంటే వశిష్ఠునికే ఎక్కువ తెలుసునని" నిజాయతీగా చెబుతాడు. "విశ్వామిత్రుని భుజబలం, వశిష్ఠుని బుద్ధిబలం" రాముని రాజ్యం కళకళలాడేందుకు కారణమౌతాయి. అందుకే వశిష్ఠుడు సాధారణ గురువు, పురోహితుడు కాదు, రాజనీతిజ్ఞుడు. అన్నీ తానై రాజ్య క్షేమం కోసం మార్గదర్శనం చేసిన గురువు. వశిష్ఠుడు రచించిన వశిష్ఠకల్పం, తంత్రం, పురాణం, శిక్ష, శ్రద్ధాకల్పం, వశిష్ఠవ్రతం, వశిష్ఠహోమం, లింగపురాణం మొదలగునవి. ఈయనకు పరమ పతివ్రత, పతిభక్తి పరాయణురాలైన అరుంధతితో వివాహమైంది. అరుంధతి పరమ పతివ్రత. పతిభక్తి పరాయణురాలుగా పేరుపొందింది. హిందూ వివాహాలలో సాంప్రదాయం ప్రకారం వివాహానంతరం వధూవరులకు అరుంధతీనక్షత్ర దర్శనం చేయిస్తారు. అరుంధతీ వశిష్ఠులకు వంద మంది కుమారులున్నారు. వారిలో శక్తిమహర్షి జ్యేష్ఠుడు. ఈతని భార్య అదృశ్యంతి. శక్తి పుత్రుడే పరాశరుడు. అతడి కుమారుడే వేదవ్యాసుడు. "ఋషికేశ్" లో కొండలపై అనేక గుహలు దర్శనమిస్తూ ఉంటాయి. మహర్షుల పాదధూళి కారణంగానే ఇక్కడి నేల పుణ్యభూమిగా వెలుగొందుతోంది. వారి తపోబలం చేత వేదభూమిగా వర్ధిల్లుతోంది. అలాంటి ఈ ప్రదేశంలో "వశిష్ఠమహర్షి గుహ" కూడా కనిపిస్తుంది. ఇంద్రాది దేవతలచే "బ్రహ్మర్షి" గా ప్రశంసలు అందుకున్న ఘనత ఒక్క వశిష్ఠమహర్షికే దక్కింది. అలాంటి వశిష్ఠమహర్షి తపస్సు చేసిన ఈ గుహను చూడగానే అనిర్వచనీయమైన అనుభూతి కలుగుతుంది. ఈ గుహను చూడగానే మనకి తెలిసిన మహర్షి రూపం కనులముందు కదలాడుతుంది. కంటికి కనిపించని దివ్యమైన తేజస్సు మనలను గమనిస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతోన్న ఆ ప్రదేశానికి భక్తిశ్రద్ధలతో నమస్కరించి భక్తులు ముందుకు సాగుతూంటారు. వశిష్ఠమహర్షి శ్రీరామచంద్రమూర్తికి చేసిన అద్వైత వేదాంత బోధ, యోగవాశిష్ఠం. రాముడు పురుషోత్తముడిగా, జనులు మెచ్చిన నాయకుడిగా తీర్చిదిద్దిన ఆ పలుకులను 'వశిష్ఠ రామ సంవాదం' గా కూడా వ్యవహరిస్తుంటారు...

...ఇంకావుంది

శ్రీ రామ జయ రామ జయ జయ రామ

# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

కాశీలో ఎవరైతే శివలింగార్చన విధిని తెలుసుకొని లింగార్చన చేస్తారో వారికి రెండు కళ్లు కాదు మూడవ కన్ను కూడా కలిగి సాక్షాత్తూ శివుడే అవుతారు అని తెలుసుకున్నారు.లక్షలకొలది గోవులను,లక్షలకొలది బంగారు కాసులను దానము చేయు వల్ల కలుగు ఫలితం ఒక్కసారి శివలింగార్చన చేయుట వలన కలుగుతుంది,అని భావించారు. విధివిధానపూర్వకముగా శివలింగమునకు అభిషేకించిన జలం మూడు సార్లు స్వీకరిస్తే వారికి ఈ జన్మలో అప్పటి వరకు మూడు విధములైన పాపముల నుండి ముక్తి కలుగుతుంది. లింగములను అభిషేకించిన జలమును తలపై చల్లుకున్న వారికి గంగా స్నానం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు అనగా గంగా స్నానం కన్నా అధిక రెట్ల ఫలితం ఉంటుంది అని అర్థం. శివలింగమును అర్చించిన వారికి, అర్చించిన శివలింగమునకు నమస్కరించిన వారికి పునర్జన్మ ఉండదు.భక్తిపూర్వకంగా శివలింగమును స్థాపించిన మానవులకు ఏడు జన్మల పాపం నశించి స్వర్గవాసం కలుగుతుంది. ఈ విధంగా ఆలోచించిన ఈ నలుగురు వారి వారి పేర్లతో శివలింగములను ప్రతిష్ఠ చేసారు. లోలార్క సమీపమున కుండేశ్వర లింగమును ప్రతిష్ఠ చేసేను.ఈ శివ లింగమును దర్శించిన వారు ఖచ్చితంగా శివలోకమును పొందుతారు. మయూరుడు మయూరేశ్వర లింగమును ప్రతిష్ఠించెను మయూరేశ్వర లింగ దర్శనము వలన మళ్లీ గర్భవాసం కలుగదు. మయూరేశ్వరునికి పశ్చిమాన బాణుడు బాణేశ్వర లింగమును ప్రతిష్ఠించెను. దర్శన మాత్రం చేత సమస్త పాపములను బాణేశ్వరుడు దూరము చేస్తాడు. గోకర్ణుడు గోకర్ణేశ్వర లింగమును ప్రతిష్ఠ చేసినాడు. ఈ లింగ దర్శనం వలన అన్ని విఘ్నములు దూరము అవుతాయి. గోకర్ణేశ్వర లింగమును పూజించినవారు ఎక్కడ మృతి చెందినా సంపూర్ణ జ్ఞానమును పొంది పరమాత్మలో చేరుతాడు.ఈ నలుగురు కూడా రాకపోవడంతో శివుడు మళ్ళీ కాశీ మహిమను తలుచుకున్నాడు.పుత్రులను, ఇంటిని,క్షేత్రమును త్యాగము చేసి మరణాంతం వరకు కాశీని ఎవరు ఆశ్రయిస్తారో వారికి చావు అంటే కూడా భయము కలుగదు. చావును సంతోషముగా స్వాగతిస్తారు. ఇంతటి మహిమ కలిగిన కాశీకి చేరిన ప్రమథ గణములు ఎందుకు భయపడతారు అని తలచాడు శివుడు. కాశీలో మృత్యువు మంగళకరము,విభూతియే ఆభరణము కాశీకి సాటి మరొకటి ఉండదు.కాశీలో శవము అత్యంత పవిత్రము,ఈ కాశీలో మరణించిన వారికి నేను స్వయంగా తారక మంత్రమును ఉపదేశిస్తాను అని శంకరుడు తలచెను.ఎవరైతే కాశీ కాశీ కాశీ అని మూడుసార్లు భక్తితో పలుకుతారో అట్టి వారిని మించిన భక్తుడు మరొకరు ఉండరు.కాశీని ఎవరైతే ధ్యానించి సేవిస్తారో వారు నన్ను తలుచుకొని నాకు సేవ చేసినట్టే.ఎవరి హృదయం సర్వదా కాశీని సేవిస్తుందో వారిని నా హృదయంలో ఉంచుకుంటాను. ఇతరుల సహాయముతో కాశీలో ఉన్న వారు కూడా నాకు అత్యంత ప్రీతిపాత్రులు అని శివుడు కాశీ యొక్క మహిమను తలుచుకున్నాడు.

...ఇంకా ఉంది



# స్తోత్రమాలిక

## శ్రీ గణపతి షోడశనామ స్తోత్రమ్

సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణకః।

లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః ॥ 1 ॥

ధూమ్ర కేతుః గణాధ్యక్షో ఫాలచంద్రో గజాననః।

వక్రతుండ శ్శూర్పకర్ణో హేరంబః స్కందపూర్వజః ॥ 2 ॥

షోడశైతాని నామాని యః పఠేత్ శృణు యాదపి।

విద్యారంభే వివాహే చ ప్రవేశే నిర్గమే తథా।

సంగ్రామే సర్వ కార్యేషు విఘ్నస్తస్య న జాయతే ॥ 3 ॥

*****



ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# గురుదేవుల జీవన కవనము

## ఏకవింశతి అధ్యాయః



పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు గారి వద్దకు పెళ్లి అయిన మరుసటి రోజే నలుగురు పరమ భక్తులు వచ్చారు. తాము ఇంట్లో భాగవత సప్తాహ పారాయణం చేస్తున్నామని మీరు రోజూ సాయంత్రం వేళలో భాగవత ప్రవచనం చేయాలి అని అభ్యర్థించారు.ఏలూరులో పౌరాణిక ప్రవచనములకు ఇదే నాంది.అప్పారావు గారు, సౌభాగ్యరావు గారు,చంటి గారు రాఘవేంద్రరావు గారు, ఈ నలుగురు గురువుగారి ఆధ్యాత్మిక ప్రవచనములకు ఏలూరులో నాంది పలికారు. ఆనాటి పద్మాకరుని అసాధారణ ధారణతో కూడిన భాగవత ప్రవచనాలను విన్న వారందరూ తరించిపోయారు.అందరూ గురువుగారిని ఘనంగా సన్మానించారు.చంటి బాబు గారి ఇంట్లో భాగవతం పూర్తయిన కొద్ది రోజుల్లోనే రామకోటిలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆనాడు ఆ ఉత్సవాల కమిటీకి అధ్యక్షులుగా ఉన్న గాదంశెట్టి చలపతి రావు గారు గురుదేవుల ప్రవచనములను చంటిగారింట్లో విని రామకోటిలో కూడా పురాణ ప్రవచనం ఏర్పాటు చేసారు.5000 నుండి 6000 మంది వరకు ఆ కార్యక్రమానికి హాజరై ప్రవచనమును విని పరవశులైపోయారు అక్కడి నుండి పద్మాకర్ గారికి వెనుతిరిగి చూడవలసిన అవసరం లేకపోయింది. భువన విజయంలోని రామరాజభూషణ పాత్రధారి రాకపోవటంతో పద్మాకర్ గారిని ఆ పాత్రను పోషించమని నిర్వాహకులు కోరడంతో,గురుదేవులు వారి గానంతో కూడిన కవితా విన్యాసంతో భువన విజయాన్ని కవన విజయంగా మార్చి ఏలూరులోని సాహిత్య వేత్తల ప్రశంసలను అందుకున్నారు. గురుదేవుల అవధానం గురించి తెలుసుకుందాం.1200 పైగా అష్ట అవధానాలు, 21 పైగా శతావధానాలు నిర్వహించారు. పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువుగారు ప్రస్తుతం భారతదేశంలో త్రిభాషా మహా సహస్రావధాని ఒక్క బ్రహ్మశ్రీ పద్మాకర్ గురువుగారే అనడంలో ఎంత మాత్రం ఆలోచించవలసిన పనిలేదు

....ఇంకా ఉంది

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


శ్రీ ప్రణవపీఠం వారి

## గుడి-బడి

ఏలూరు

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో గురు భక్తులు అందరూ భక్తి తో గుడి-బడి కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్న దాన కార్యక్రమములు యథా శక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రమములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.

